క్లుప్తంగా

ప్రత్యేక ఆకర్షణగా బొమ్మల కొలువు



పెద అమిరం కోడిపందేల వద్ద ఆకర్షిస్తున్న బొమ్మలకొలువు

కాళ్ల: మండలంలోని పెదఅమిరం గ్రామంలో భారీ కోడిపందేలలో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు అందరినీ ఆకర్షిస్తుంది. కోడి పందేలు ప్రారంభంలో బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. కోడిపందేలను వీక్షించేందుకు వచ్చిన ప్రతి ఒక్కరూ ముందుగా బొమ్మల కొలువును చూసేలా తీర్చిదిద్దారు. దీంతో ఈ ప్రాంతంలో సెల్ఫీలు, ఫోటోలు దిగేందుకు ఆసక్తి చూపారు.

వైభవంగా గోదా రంగనాథుల కల్యాణం



గోదాదేవి, రంగనాథ కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: ధనుర్మాసం ఆఖరి రోజు విష్ణువాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భోగి పండుగ పర్వదినం సందర్భంగా పలు చోట్ల భోగి మంటలు వేశారు. వైష్ణవ ఆలయాల్లో నెల రోజుల పాటు ఆలయం వద్ద తిరుప్పావై పాశురం గానం చేసిన అనంతరం గోదా కల్యాణం నిర్వహించారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వరద రాజస్వామి ఆలయంలో గోదా కళ్యాణం ఆలయ చైర్మన్ రామిశెట్టి సూర్యప్రసాద్(సూరిబాబు), సత్యవతి దంపతులు, టి.ప్రసాద్ శైలజ దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక మదన(వేణు)గోపాలస్వామి ఆలయంలో తిరుప్పావై గానం అనంతరం గోదాదేవి రంగనాథ కల్యాణం వైభవంగా చేశారు. అర్చకులు శేషాచార్యులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి కల్యాణోత్సవ మహిమను మహిళా మండలి అధ్యక్షురాలు కె.రాజేశ్వరి అక్కయ్య భక్తులకు వివరించారు.

అలరించిన ముగ్గుల పోటీలు



రైల్వే స్టేషన్ ఆవరణలో ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: సంక్రాంతి సందర్భంగా ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకర్షించాయి. మంగళవారం జరిగిన ముగ్గుల పోటీల్లో 100 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. సీనియర్ల మొదటి బహుమతి కే.రేణుక, రెండో బహుమతి ఎస్.గిరి జాంబిక మూడవ బహుమతి కె.రేష్మ, జూనియర్స్‌లో మొదటి,రెండవ బహుమతులు ఎన్.దీపిక శ్రీ, హర్షిత, ఎం.గీతిక, మ్యూజికల్ చైర్స్ సీనియర్స్‌లో ఎల్.ఝాన్సీ, ఏ.స్వాతి, జూనియర్స్‌లో బీ.హర్షిత,కే.పద్మావతిలు సాధించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మావతి, నెల్లి సతీష్, సంఘ కార్యదర్శి ఉదయ్ కుమారి, కృష్ణవేణి, పార్వతి, లావణ్య,లక్ష్మి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి కల్యాణోత్సవాలు



దగ్గులూరులో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని దగ్గులూరు తూర్పువీధిలో ఉన్న శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం నిర్వహించారు. మత్స్యపురి గ్రామానికి చెందిన హరేశ్రీనివాస గ్రూపు చిన్నారులు కోలాటం నిర్వహించారు. గ్రామ పెద్దలు రథాన్ని లాగి లాంఛనంగా ప్రారంభించారు.

ఘనంగా అయ్యప్పస్వామి తీర్థ మహోత్సవం



మార్టేరులో అయ్యప్ప స్వామి ఆభరణాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న దృశ్యం

పెనుమంట్ర: మార్టేరు గ్రామంలో ఉన్న అయ్యప్ప స్వామి వారి 19వ తీర్థ మహోత్సవం బుధవారం ముగిసింది. ఈ నెల 13న అయ్యప్ప స్వామికి అభిషేకాలతో ప్రారంభించి మూడు రోజుల పాటు గోపూజ, శాస్త్ర పుష్పార్చన, పడిపూజ, ఆభరణాల ఊరేగింపు, బుధవారం జ్యోతి దర్శనం, అన్నసమారాధన, కార్యక్రమాలతో నిర్వహించారు. అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

జోరుగా కోడి పందేలు

- నిబంధనలకు నీళ్లు..యథేచ్ఛగా బరులు
- పట్టించుకోని పోలీసులు



ఆకివీడు: పందెంలో తలపడుతున్న కోళ్లు



ఉండి: పాములపర్రులో జోరుగా కోడిపందేలు నిర్వహిస్తున్న దృశ్యం



ఆకివీడు: మండలంలోని ఓ బరి వద్ద గుండాటలో చిన్నారులు



పెనుగొండ: కొఠాలపర్రులో కోడిపందేలు నిర్వహిస్తున్న దృశ్యం



కాళ్ల : మండలంలో కోడి పందేలను నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: సంక్రాంతి అంతా జూదశాలలు, మద్యం దుకాణాల వద్దనే అంగరంగ వైభవంగా సాగింది. రాష్ట్రంలో కూటమిపార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనంతరం గత ఏడు నెలలుగా ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలన్నీ నిలిచిపోవడంతో పాటు సార్వా సీజన్‌లో వరదలు, భారీ వర్షాలు కారణంగా రైతులకు పెట్టుబడులు పెరిగి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీనితో ప్రజల చేతిలో చిల్లిగవ్వకూడా లేకపోవడంతో సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే సంక్రాంతి ఎంతో సాదాసీదాగా పండుగ జరుపుకున్నామనే పద్ధతిలో చేసుకున్నారు. అయితే గతంలో ఎన్నడూలేని విధంగా సంక్రాంతి పండుగకు విచ్చలవిడిగా కోడి పందేలు, వాటి వద్దనే గుండాట, పేకాట వంటి జూదాలతోపాటు డాన్స్‌ప్రోగ్రామ్స్, క్యాసీనో జూదాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. అలాగే అడ్డుఅదుపు లేకుండా మద్యం విక్రయాలు సాగడంతో మందుబాబులు, జూదగాళ్లు పేట్రేగిపోయారు.

ప్రజాప్రతినిధుల అండతోనే..

జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధుల అండతోనే కోడిపందేలు, అసాంఘిక కార్యక్రమాలు జోరుగా సాగాయనే ప్రచారం ఉంది. ప్రధానంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఇరువురు ప్రజాప్రతినిధులు కూటమి పార్టీ నాయకులకు అండగా నిలిచి జూదాలు నిర్వహణకు అవకాశం ఇచ్చినట్లు చెబుతున్నారు. వీరితో ప్రతినియోజకవర్గంలో కూటమిలోని నాయకులు కొంతమంది భారీ మొత్తంలో ముడుపులు తీసుకుని కోడి పందేలు, జూదాల నిర్వహణకు అండగా నిలిచినట్లు బాహాటంగానే చెబుతున్నారు. సాంప్రదాయం పేరుతో నిర్వహించే కోడి పందేల కంటే జూదాలు, అసాంఘిక కార్యక్రమాలపై ఎక్కువ దృష్టిసారించారు. కోడి పందేల బరులు వద్ద జూదాలు నిర్వహణకు పెద్ద మొత్తంలో సొమ్ములు తీసుకుని అవకాశం కల్పించారు. దీనిలో భాగంగా వీరవాసరం మండలంలోని ఒక కోడి పందేల బరి వద్ద జూదాల నిర్వణకు రూ. 80 లక్షలు పందాలకు ఏర్పాటు చేసిన నిర్వహకులు తీసుకున్నారంటే మిగిలిగిన ప్రాంతాల్లో ఎంత పెద్ద మొత్తం చెల్లించి ఉంటారో అవగతమవుతోంది.

పోలీసులకు రిక్తహస్తమేనా?

ఏటా కోడి పందేల నిర్వహకులు పెద్ద మొత్తంలో పోలీసులకు మామూళ్లు ఇవ్వడం పరిపాటి. అయితే ఈ ఏడాది మా ప్రభుత్వం అధికారంలో ఉంది మీకిచ్చేది ఏమిలేదంటూ పందేల నిర్వహకులు పోలీసులకు మొండిచేయి చూపిస్తున్నట్లు తెలిసింది. పందేల బరులు వద్దకు వెళ్లిన పోలీసు సిబ్బందికి చేతిలో ఎంతో కొంత పెట్టి పంపించడం మినహా పెద్ద మొత్తంలో ఇచ్చే దాఖలాలు కన్పించడం లేదని పోలీసులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు.

మూడో రోజూ అదే జోరు

పాలకోడేరు: సంక్రాంతి మూడో రోజు బుధవారం కూడా మండలంలో ని గొల్లలకోడేరు, పాలకోడేరు, మోగల్లు, శృంగవృక్షం, పెన్నాడ, విస్సా కోడేరు, గరగపర్రుకోరుకొల్లు, పెద్ద ఎత్తున కోడి పందేలు జరిగాయి. ప్రజా ప్రతినిధులు సైతం కోర్టు ఉత్తర్వులు లెక్క చేయకుండా బాహాటంగానే పందేల్లో పాల్గొనడం గమనార్హం. కొన్ని చోట్ల మహిళలు కూడా పందేల్లో పాల్గొన్నారు. కోడి పందేలతో పాటు గుండాట, కోతాట, నంబర్ ఆట కొనసాగాయి

ఆకివీడులో..

ఆకివీడు: కోడి పందేలు మూడవ రోజు కూడా కొనసాగాయి. పలు చోట్ల యథేచ్ఛగా కోడి పందేలు, జూదం, గుండాటలు భారీగా కేంద్రాలు వెలిశాయి. అయితే ఆయా కేంద్రాలు వెలవెలబోయాయి. పండుగ చేసుకునేందుకే ప్రజల వద్ద డబ్బులేకపోవడంతో పండుగ రోజుల్ని పేలవంగా జరుపుకున్నారు. యాభై శాతం జూదం, గుండాట కేంద్రాల్లో జనం లేక నిర్వాహకులు నిరుత్సాహంతో టెంట్లు, కుర్చీలను వదిలివేసి వెళ్లిపోయారు. పోలీసులకు మాత్రం వారి మామూళ్లు యథావిధిగా అందించాల్సి వచ్చిందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వీటితో పాటు ఒక్కో కేంద్ర నుండి నలుగురు వ్యక్తుల పేర్లు, ఆధార్ కార్డు ఇవ్వాలని వారి పేరున కేసులు పెడతామని ఒత్తిడి చేస్తున్నట్లు పలువురు నిర్వాహకులు వాపోతున్నారు. టెంట్లు, కుర్చీలు, కూలీల కూలి, అద్దెలు చెల్లించలేక, లోబదిబోమంటున్నారు. చిన్నాచితకా కేంద్రాల్లోని నిర్వాహకులు లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నట్లు సమాచారం. ప్రజల వద్ద తగినంత డబ్బు లేకపోవడంతో సంక్రాంతి పండుగ కాంతిహీనంగా వెళ్లిపోయింది.

కాళ్లలో..

కాళ్ల: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మూడు రోజులు కోడి పందేలు జోరుగా సాగాయి. కోడిపందేల్లో మూడు రోజులకు గాను మండలంలో సుమారు 50 కోట్ల రూపాయలపైనే చేతులు మారినట్లు పందెంరాయుళ్లు అంచనా వేస్తున్నారు. సంక్రాంతి, కనుమ రెండు రోజుల్లో భారీ ఎత్తున కోడి పందేలు వేశారు. పగలే కాకుండా కొన్ని గ్రామాల్లో రాత్రిపూట నిర్వహిచేందుకు ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసి కోడి పందేలు నిర్వహించారు. కోడి పందేలుకు వచ్చే వాహనాలతో రోడ్లన్నీ స్తంభించిపోయాయి. మండలంలో ప్రధానంగా సీసలి, పెదఅమీరం గ్రామంలో ఏర్పాటుచేసిన భారీ కోడి పందేల బరిలో పందెంరాయుళ్లకు ఇబ్బంది కలగకుండా పందేలు వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. పందెంరాయుళ్లను కట్టడి చేసేందుకు బౌన్సర్ లను ఏర్పాటు చేశారు. పండుగ మూడు రోజులు కోడి పందేలను తిలకించేందుకు ప్రత్యేక పాస్‌లు ఏర్పాటు చేశారు. ప్రధానంగా మండలంలో కాళ్లకూరు, ఏలూరుపాడు, కాళ్ల, సీసలి, కోపల్లె, జక్కరం, మోడి, పెదఅమీరం, మాలవానితిప్ప గ్రామాల్లో జోరుగా పందేలు నిర్వహించారు. సీసలి, పెదఅమీరం కోడిపందేల బరిలో నియోజకవర్గ స్థాయి నాయకులతో పాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు నాయకులు కోడిపందేలను తిలకించారు. అంతేకాకుండా పందేలు తిలకించేందుకు వచ్చిన పందెంరాయుళ్ల, ప్రజలకు భోజనాలు ఏర్పాటు చేశారు. సంక్రాంతి పండుగ పేరు చెప్పుకుని మద్యం దుకాణాలలో బాటిల్ కు పది రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని మద్యం బాబులు లబోదిబోమంటున్నారు. అయినా అటువైపు అధికారులు చూడకపోవడం పై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉండిలో..

ఉండి: సంక్రాంతి పండుగ మాటున కోడిపందేలు, పేకాట, గుండాట వంటి జూద క్రీడలు మంగళవారం, బుధవారం కూడా పెద్ద ఎత్తున నిర్వహించారు. ఉండి, పాములపర్రు, కోలమూరు, మహదేవపట్నం, ఎన్నార్పీ అగ్రహారం, యండగండి, కలిగొట్ల గ్రామాల్లో నిర్వహించిన పందెం బరుల వద్ద పెద్ద ఎత్తున నగదు చేతులు మారింది. గత మూడురోజుల్లో సుమారు రూ.4 నుండి రూ.5 కోట్లు కోడిపందేలు, జూదం పేరుతో చేతులు మారింది.ఎక్కడా పోలీసులు కానరాకపోవడంతో రాత్రి పగలూ తేడా లేకుండా కోడిపందేలు, జూదాలు నిర్వహించారు. ప్రత్యేకించి ఉండి, మహదేవపట్నం గ్రామాల్లో జూదం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఓ ప్రత్యేక ప్రాంతాల్లో ఎవ్వరికీ అనుమతి లేకుండా జాగ్రత్తలు తీసుకుని కొంతమంది అతిథులను(తెలంగాణాకు చెందిన వారు కూడా ఉన్నారు) మాత్రమే ఆహ్వానించి వారికి భోజన వసతులు సదరు భవంతిలోనే కల్పించి వారితో మూడు రోజుల పాటు విచ్చలవిడిగా జూదం ఆడించారు. కూటమి ప్రభుత్వం పెద్దల ఆశీస్సులు,పోలీసుల అనధికార అనుమతులు ఉండటంతో జూదరులకు రెచ్చిపోయారు.

బరికి ఇంత ఇవ్వాల్సిందే

మండలంలో కోడిపందేలు,జూద క్రీడలు నిర్వహించిన వారు బరికి కొంతమొత్తం చెల్లించాల్సిందేనని ముందుగానే అవగాహనకు వచ్చినట్లు తెలుస్తుంది. అనుమతులు ఇప్పించినవారికి, అనధికార అనుమతులు ఇచ్చినవారికి బరికి రూ.45 వేల నుంచి రూ.60 వేల వరకు ఇవ్వాల్సిందేనని బేరాలు కుదిరినట్లు నిర్వాహకులు చెప్పుకుంటున్నారు. బేరాలు కుదరడంతో జూదరులు మూడు రోజులపాటు పట్టపగ్గాలు లేకుండా బరితెగించారు.

వీరవాసరంలో..

వీరవాసరం: వీరవాసరం మండలంలో ఎక్కడ చూసినా సంక్రాంతి సంబరాలతో బుధవారం పెద్ద ఎత్తున కొనసాగాయి. వీరవాసరం, నౌడూరు జంక్షన్, ఉత్తర పాలెం, నందమూరి గరువు, నవుడూరు, మత్స్యపురిపాలెం, మత్స్యపురి తదితర గ్రామాల్లో పందేల బరులు పెద్ద ఎత్తున నిర్వహించారు. నౌడూరు జంక్షన్, వీరవాసరంలో కోడిపందేలు పెద్ద ఎత్తున జరిగాయి. కోడి పందేలు, గుండాటల్లో లక్షలాది రూపాయలు చేతులు మారాయని పందెంరాయుళ్లు పేర్కొన్నారు. నందమూరి గరువు బరిలో ముఖ్యంగా కోతాటలు పెద్ద ఎత్తున నిర్వహించారు. పందేల బరులులో కూటమి నాయకులు ఫ్లెక్సీ లతో హడావుడి చేశారు.

వాండ్రంలో ఉచిత వైద్య శిబిరం

ఉండి: మండలంలోని వాండ్రం గ్రామంలోని రామాలయ ఆవరణలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు బుద్ధరాజు రామరాజు, గుంటూరు సూర్యనారాయణ రాజు, గుంటూరు రాజశేఖర్‌వర్మ, సుజానీవర్మ, దియావర్మలు పాల్గొని రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

కోడి పందేలు, పేకాటరాయుళ్ల అరెస్టు

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో సంక్రాంతి సందర్భంగా బుధవారం పేకాట, కోడి పందేలు నిర్వహిస్తున్నవారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ బీవై కిరణ్‌కుమార్ చెప్పారు. పట్టణంలోని ఇండ్రస్ట్రీయల్ ఏరియాలో పేకాడుతున్న ఎ జగదీష్ మరొక ఇద్దరి అరెస్టు చేసి వారి నుంచి రూ. 3,300 స్వాధీనం చేసుకున్నారు. అలాగే రిలయన్స్ పెట్రోల్‌బంక్ ప్రాంతంలో పేకాడుతున్న బి తేజకృష్ణ మరొక నలుగుర్ని అరెస్టు చేసి వారి నుంచి రూ. 3,400లు స్వాధీనం చేసుకున్నారు. కుముదవల్లిరోడ్డులో పేకాడుతున్న మెంటేవారితోటకు చెందిన ఎం నాగశ్రీనివాస్, మరొక అయిదుగురిని అరెస్టు వారి నుంచి రూ. 4,900 స్వాధీనం చేసుకున్నారు. తాడేరు కాలువ వద్ద బీఎస్ఆర్ లేఅవుట్‌లో కోడి పందేలు నిర్వహిస్తున్న కె రాంబాబు మరొ ఇరువుర్ని అరెస్టు చేసి వారి నుంచి రూ. 4,100 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ చెప్పారు.వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

ఉండి: తెలుగు ప్రజల సంస్కృతీ సాంప్రదాయాల్లో ప్రధానమైనది ముగ్గుల కళ ఇది అంతరించిపోతుందని మానవత సేవాసంస్థ మండల అధ్యక్ష, కార్యదర్శులు పెన్మత్స రామకృష్ణంరాజు, గాదిరాజు రంగరాజు అన్నారు. సంక్రాంతి పండుగను నేపథ్యంలో బుధవారం కలిసిపూడిలో మానవత సంస్థ ఆధ్వర్యంలో ముగ్గులపోటీ నిర్వహించారు. సంస్కృతీ సంప్రదాయాల మేలు కలయికే మన పండుగలు అని అన్నారు. అయితే ప్రస్తుతం వాటిని విస్మరిస్తున్నట్లు ఉందని అన్నారు. సాంకేతిక అభివృద్ధి పేరుతో సంస్కృతిని మరిచిపోవడం తగదని సూచించారు. ఈ పోటీల్లో రేష్మ, శిరీష, పావని మొదటి మూడు బహుమతులు గెలుపొందారు. గెలుపొందిన వారితో పాటుగా పాల్గొన్న 30 మందికి ప్రత్యేక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సంస్థ కో కన్వీనర్ దంగేటి రామలింగేశ్వరరావు, కొమ్మన నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి సేవలు మరువలేనివి



భీమవరంలో రామ్మూర్తిపంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాషాభివృద్ధికి విశేష సేవలందించారని ప్రముఖ తెలుగు పండితులు కలిగొట్ల గోపాల శర్మ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో వీరమ్మ పార్క్‌లోని తెలుగు తల్లి విగ్రహం వద్ద గిడుగు రామ్మూర్తి పంతులు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు భాషాభివృద్ధి సంఘం నాయకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లు తెలుగు భాషకు అతి ప్రాముఖ్యత కల్పించి తెలుగు భాషకు న్యాయం చేయడం రామ్మూర్తి పంతులకు నిజమైన నివాళి అని అన్నారు. కళా రంజని నాటక పరిషత్ అకాడమీ సభ్యులు జవ్వాది శ్రీనివాస్, చైతన్య భారతి నాటక పరిషత్ సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ దిగ్గజాలైన తెలుగు కవులు కలం నుంచి జాలు వారిన గ్రంథాలు యుగాంతం వరకు నిలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో కోయ రాంబాబు, ఎం. సీతారామ ప్రసాద్, గాంధీ, భగత్ సింగ్, లక్ష్మణ్, ఎస్ కే బాస్ భాషా తదితరులు పాల్గొన్నారు.

చెరుకూరి సేవలు ఎనలేనివి



పారిశుధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణానికి చెరుకూరి లక్ష్మణరావు చేసిన సేవలు ఎనలేనివని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కడప ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. నరసాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ చెరుకూరి లక్ష్మణరావు పేరుమీద ఆయన కుమారుడు రంగనాథ్ నడుపుతున్న చెరుకూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో పని చేస్తున్న 150 మంది పారిశుధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే, ఎస్పీలు మాట్లాడుతూ లక్ష్మణరావు చైర్మన్‌గా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీ వెంకటరమణ, కోటిపల్లి సురేష్ పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి



అగ్నిప్రమాద బాధితులకు సహాయం చేస్తున్న పమ్మి లాజరు

యలమంచిలి: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే నిజమైన దైవసేవని బీసీ సంక్షేమ సంఘం పాలకొల్లు నియోజకవర్గ అధ్యక్షుడు పొన్నమండ ముత్యాలరావు చెప్పారు. వడ్డిలంక గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పోర్షన్ల తాటాకిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కామన మారియ్య, నాగమణి, కామన నాగేశ్వరరావు, దుర్గాభవాని కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ప్రమాదంలో గృహోపకరణాలన్నీ దగ్ధం కావడంతో ఆ రెండు కుటుంబ సభ్యులు కట్టు బట్టలతో మిగిలారు. ప్రమాద విషయం తెలుసుకున్న అగాపే చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పమ్మి లాజరు అగ్నిప్రమాద బాధితులకు రెండేసి జతల చొప్పున రగ్గులు, దుప్పట్లు, దుస్తులు 26 కిలోల బియ్యం ముత్యాలరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులకు ప్రమాద బాధితులతోపాటు గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంఘ నాయకుడు చిట్టిబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

పాలకొల్లు అర్బన్: మండలంలోని చందపర్రు, ఆగర్రులో రూ.7 5లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. ఆగర్రులో 90 శాతం సబ్సిడీతో నిర్మించిన గోకుల షెడ్డును మంత్రి ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, సర్పంచ్‌లు కొయ్యే అచ్చియ్య, సాకా గంగారత్నం, తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్, ఎంపీడీఓ ఎస్ఎస్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



ఉండి గోరింతోటలో కలిసిన 1978-79 బ్యాచ్ విద్యార్థులు

ఉండి: ఆకివీడు మండలం చినకాపవరం జెడ్పీ హైస్కూల్లో 1978-79 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఉండి గోరింతోటలో సమావేశమయ్యారు. వారి సౌలభ్యతను బట్టి గోరింతోటలో నిర్వహించిన ఈ సమ్మేళనంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొని తమ తీపిగుర్తులను నెమరవేసుకున్నారు. విద్యార్థి దశలో తమ అనుభవాలను గుర్తు చేసుకుని సంతోషాలను పంచుకున్నారు.అలాగే వారి వారి పరిచయాల అనంతరం విందు భోజనాన్ని చేసి తమ స్వస్థలాలకు చేరుకున్నారు.ఈ కార్యక్రమంలో కఠారి వెంకటకృష్ణ, వైఎన్ కళాశాల లెక్చరర్ కేఎస్ఎన్ రంగరావు, సీనియర్ జర్నలిస్టు కర్రెడ్డి రామకృష్ణ, కె.ప్రసాద్, కె.పేటుమల్లు, ఎస్.మోహన్‌రంగారావు, దండు గోపాలకృష్ణంరాజు, క్షీరసాగర్, వెంకట్రాజు, మంచాల సత్యనారాయణ, నాగేశ్వరరావు, మల్లికార్జున, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆత్మీయ సమ్మేళనం



2001-2002 బ్యాచ్ విద్యార్థులు

పాలకోడేరు: తమ పాఠశాలలో చదివిన విద్యార్థులందరూ ఉన్నత స్థానాల్లో నిలిచినందుకు చాలా సంతోషంగా ఉందని ప్రధానోపాధ్యాయులు వి.రామకష్ణ మూర్తి అన్నారు. ఆదివారం పాలకోడేరు లో రుద్రరాజు నాగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-2002 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. సోషల్ టీచర్ ఎస్. నీలకంఠేశ్వర రాజు మాట్లాడుతూ మీ పిల్లలు కూడా నైతిక విలువలు, సంస్కృతి సాంప్రదాయాలను నేర్పించి వారికి మంచి భవిష్యత్ అందించాలన్నారు. ఉపాధ్యాయులు నరసింహారాజు, సత్యనారాయణ రాజు, రంగరాజు, నాగరాజు, టీవీ సత్యనారాయణ రాజు, రేణుకా దేవి, ఝాన్సీ రాణి, భారతి, లక్ష్మినారాయణ, సోమరాజు పాల్గొన్నారు.

వైభవంగా ప్రభల ఉత్సవం



వడలిలో ప్రభల ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: కనుమ పండుగ సందర్భంగా ప్రభల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం వడలిలో వీరభద్రుని ప్రతిరూపంగా ప్రభతో గ్రామోత్సవం నిర్వహించారు, జొన్నల ప్రసాదం పంపిణీ చేశారు. పశువుల వృద్ధి చెందానల పంటలు పండాలని అగస్త్యేశ్వర స్వామి కొలువై ఉన్న ప్రభల ఉత్సవం గ్రామం శివారున పంట పొలాల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జొన్నల ప్రసాదాన్ని సంతాప ప్రాప్తి కోసం, వివాహ యోగ్యం కోసం పోటీ పడి తీసుకొన్నారు.

కొబ్బరి చెట్టు కూలి దెబ్బతిన్న భవనం

పెనుగొండ: సిద్ధాంతం ఘటాల దిబ్బలో కొబ్బరి చెట్టు కూలి భవనం పాక్షికంగా దెబ్బతింది. మంగళవారం సాయంత్రం కొబ్బరి చెట్టు ఒక్కసారిగా కూలి బైలపాటి వెంకటేశ్వర్లుకు చెందిన ఇంటిపై కూలిపోయింది. దీంతో శ్లాబు కొంత మేర దెబ్బతినడంతో భవన యజమానులు భయాందోళనలకు గురయ్యారు. చెట్టు కూలిన సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడతో ప్రమాదం తప్పింది.

దుప్పట్ల పంపిణీ

తాడేపల్లిగూడెం: లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. డైమండ్స్ క్లబ్ వారిచే బుధవారం పట్టణంలోని పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.